క్లుప్తంగా

ముగిసిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు



తెనాలిటౌన్: పట్టణ బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలో సంగీత సద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో సద్గురు త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు సోమవారంతో ముగిశాయి. రెండవ రోజు హైదరాబాద్‌కు చెందిన శ్రీధర్ కచేరీ అద్భుతంగా జరిగింది. వయోలిన్‌పై విజయవాడకు చెందిన పి.నాగేశ్వరరావు, మృదంగంపై తెనాలి కళాకారుడు కె.వి.రామకృష్ణ, డమరుకంపై కందుల ఆశోక్ కుమార్ వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమాన్ని సేవా సమితి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

చెట్లు పెంచడం అందరి బాధ్యత

తెనాలిఅర్బన్: మానవాళికి జీవనాధారమైన చెట్లను పెంచడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ తెలిపారు. పట్టణ వీఎస్సార్ కళాశాల రోడ్డులోని పల్లవి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవనానికి అవసరమైన గాలిని శుభ్రం చేసేందుకు, ప్రకృతి విపత్తుల నుంచి భూమిని కాపాడేందుకు చెట్లను ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పెంచాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, కోశాధికారి జగదీశ్వరాంబ, రోటరీ సభ్యులు వీరవల్లి మురళి, జి.వెంకటనారాయణ, ఈదర వెంకట పూర్ణచంద్, జి.వి.నారాయణ, డాక్టర్ జీవనలత, ఈదర శ్రీనివాసరావు, డి.మురళీకృష్ణ, కె.ఉపేంద్ర, ఎం.అర్జున్, రాజాకొఠారి పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నేడు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

రేషన్ పంపిణీ సకాలంలో చేయాలి



తెనాలిరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రాత్రి పట్టణ మండల పరిధిలోని ఎండీయూలు, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ కె.రవిబాబు పాల్గొని ఇంటింటికీ రేషన్ పంపిణీపై ఎండీయూలకు పలు సూచనలు చేశారు. 1వ తేదీ నుంచి 15వ తేదీలోగా రేషన్ పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా జరిగేలా చూడాలని ఎవరికీ ఇబ్బంది లేకుండా సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని చెప్పారు. సరుకుల వివరాలను ఎండీయూ వాహనాల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. చిన్న చిన్న ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. మండల పరిధిలోని ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు, అధికారులు పాల్గొన్నారు.

చిన్నారితో యువకుడి అసభ్య ప్రవర్తన

తాడికొండ: బాలిక(4)పై యువకుడు అసభ్య ప్రవర్తనకు పాల్పడిన ఘటన తాడికొండ మండలం రావెల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నక్కా గోపి(18) పక్క ఇంటిలో ఉంటున్న నాలుగు సంవత్సరాల చిన్నారి ఆడుకుంటుండగా ఇంటిలోకి పిలిచి తలుపు వేసి అసభ్యంగా ప్రవనర్తించాడు. బాలిక కేకలు వేస్తుండటంతో గమనించిన తల్లి కిటికిలోంచి తొంగి చూడగా నిందితుడు తల్లిపై రాళ్లు విసిరి ఘటనా స్థలం నుంచి పారిపోయాడు. చిన్నారితో కలసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి బాలికను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హ్యాండ్ రైటింగ్‌లో విద్యార్థిని ప్రతిభ

తాడేపల్లిరూరల్: రాష్ట్రస్థాయి హ్యాండ్ రైటింగ్ పోటీలలో ఎంటీఎంసీ పరిధిలోని సులకపేట ఉర్దూ పాఠశాలకు చెందిన విద్యార్థిని ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతిని సాధించింది. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని రజినిని ఎంఈఓలు శాంతకుమారి, డి. నాగేశ్వరరావు తమ కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ షజీర్ పాల్గొన్నారు.

అక్క చెల్లెమ్మలకు ఇచ్చిన హామీని నిలుపుకున్న ప్రభుత్వం

- నాలుగు దఫాలుగా వడ్డీతో సహా రూ.25 వేల కోట్లు చెల్లింపు
- మనసున్న ముఖ్యమంత్రిని, తనను ఆశీర్వదించాలన్న ఎమ్మెల్యే శివకుమార్



డ్వాక్రా మహిళలకు రూ.2.54 కోట్ల నమూనా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: గత ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసగిస్తే, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాటను అధికారంలోకి వచ్చాక నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. నాడు చంద్రబాబు ప్రభుత్వం రూ.14 వేల కోట్ల డ్వాక్రా రుణాలను మాఫీ చేయలేక చేతులు ఎత్తేస్తే, వడ్డీతో సహా రూ.25 వేల కోట్లకు చేరిన రుణాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు దఫాలుగా చెల్లించారని చెప్పారు. వైఎస్సార్ ఆసరా సంబరాల్లో భాగంగా సోమవారం చినరావూరులోని 13వ వార్డు కమ్యూనిటీ హాలులో వేడుకలు నిర్వహించారు. పట్టణ మున్సిపాలిటీలోని 11–20 వార్డుల పరిధిలో గల 304 డ్వాక్రా సంఘాలకు రూ.2.54 కోట్ల నమూనా చెక్కును ఎమ్మెల్యే శివకుమార్ పంపిణీ చేశారు. పట్టణంలోని 1,498 డ్వాక్రా సంఘాల్లోని 14,656 మందికి తొలి విడత రూ.11.80 కోట్లు, రెండో విడత రూ.12.14 కోట్లు, మూడో విడత రూ.11.97 కోట్లు, నాలుగో విడత రూ.11.97 కోట్ల చొప్పున మొత్తం రూ.47.88 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసిందన్నారు.

నాలుగున్నరేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా రూ.2.57 లక్షల కోట్లను ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా అందించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 540 ఎకరాలను కొనుగోలు చేసి రికార్డు స్థాయిలో 27 వేల మందికి ఇళ్లస్థలాలను పంపిణీ చేశామని గుర్తుచేశారు. లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్లస్థలాలను వారి పేరిటే రిజిస్ట్రేషన్ చేసి, హక్కులను కల్పిస్తూ ఒక



అంగన్‌వాడీ భవనం శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే శివకుమార్

ఆస్తిగా ప్రభుత్వం ఇస్తోందని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛను మొత్తాన్ని ఏటా పెంచుతూ ప్రస్తుతం నెలకు రూ.3 వేల వంతున నియోజకవర్గంలో 37 వేల మందికి అందజేస్తున్నామని చెప్పారు. కరోనా కాలంలో ఒకరు హైదరాబాద్‌లో, మరొకరు గుంటూరులో దాక్కున్న నాయకులు ఎన్నికలకు నాలుగు నెలల ముందు సూట్‌కేసుల్లో బట్టలు సర్దుకుని వాలిపోయారని ప్రతిపక్షాలనుద్దేశించి వ్యాఖ్యానించారు. అదేమంటే మాదీ తెనాలి అంటున్నారని అన్నారు. కరోనా రోజుల్లోనూ తాను నిత్యం ప్రజల్లో తిరుగుతూ బాధితులకు అండగా ఉన్నానని చెప్పారు. తనకు సైతం కరోనా సోకిందని గుర్తుచేశారు. ఎన్నికలకు ముందు మభ్యపెట్టే మాటలను వినొద్దనీ, ప్రజలకు నిత్యం మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని, తననూ ఆశీర్వదించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ గత ఎన్నికల్లో 12 నెలలు గ్యాస్ సిలిండర్లకు సబ్సిడీ నిస్తానన్న చంద్రబాబు ప్రభుత్వం హామీని నిలుపుకోలేదని గుర్తుచేశారు. మళ్లీ ఇప్పుడు మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తానని చెబుతుంటే ఎలా నమ్ముతామని ప్రశ్నించారు. డ్వాక్రా రుణాలపైనా మాట తప్పిన ప్రతిపక్షాన్ని నమ్మొద్దని చెప్పారు. మెప్మా మాధవరావు, సీడీపీవో అరుణ, కౌన్సిలర్లు కొర్రా యశోద, దాసరి వీరవసంతరావు, రాష్ట్ర కృష్ణబలిజ, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, పార్టీ నాయకులు కాళిదాసు, కోలా వాసు, చుండూరు సాయి, కొల్లా గురునాధగుప్త మాట్లాడారు. షేక్ దుబాయ్‌బాబు, తాడిబోయిన రమేష్, యాతాటి అనిల్, రెడ్రౌతు బాలరాజు, మహమ్మద్ సుభాని, ఉడుముల మహేష్‌రెడ్డి, అక్కిదాసు కిరణ్ పాల్గొన్నారు.

రూ.29.50 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభం

తెనాలి: ప్రజావినతుల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పట్టణ చినరావూరులోని 13వ వార్డులో సోమవారం సాయంత్రం రూ.29.50 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. రూ.9.50 లక్షలతో ఫ్లోరింగ్ టైల్స్, పెయింటింగ్, విద్యుదీకరణ, మంచినీటి సౌకర్యాలతో పూర్తిచేసిన అంగన్‌వాడీ భవనాన్ని, గడప గడపకు మన ప్రభుత్వంలో వచ్చిన వినతులతో చినరావూరులోని కమ్యూనిటీ హాలుకు అనుబంధంగా రూ.20 లక్షలతో నిర్మించిన కిచెన్, డైనింగ్‌హాలును ఎమ్మెల్యే శివకుమార్, 13వ వార్డు కౌన్సిలరు కుర్రా సుజాత ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో వచ్చిన సమస్యలను పరిష్కరించటం తమ బాధ్యతగా చెప్పారు. చైర్‌పర్సన్ ప్రతిరోజూ వార్డుల్లో పర్యటిస్తూ డ్రైనేజి కాలువల వ్యవస్థను బాగుచేయిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, రాష్ట్ర జలవనరుల కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, 34వ వార్డు కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, మున్సిపల్ ఇంజినీరు నాగమల్లేశ్వరరావు, డీఈఈ రావూరి సుబ్బారావు, ఏఈ చైతన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు పెద్దలు దేవరపల్లి కిషోర్, తాడిబోయిన రమేష్, అక్కిదాసు కిరణ్, పనిల్లి వీరయ్య, పఠాన్ షరీఫ్, పిల్లి ప్రేమరాజ్, చంద్రశేఖర్, కుర్రా వెంకటేశ్వరరావు, అక్కల రమేష్, భూషణం, ఆనంద్, వెంకట్రావు, సీడీపీవో సునీత, సూపర్‌వైజర్ రాధిక, ఎం.నాగసింధు, జి.సంతోష, ఎం.శోభదేవి, పి.లలితమ్మ పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాకు చర్యలు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెంలో సొసైటీలో ఎరువులు సరఫరాకు చర్యలు తీసుకుంటామని జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.అరుణ తెలిపారు. సోమవారం పలువురు రైతులు ఎరువులు అందుబాటులో లేవని, నూతక్కి సొసైటీకి వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె పెదపాలెం సొసైటీకి వెళ్లి అధికారులతో చర్చించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పెదపాలెం సొసైటీ అధ్యక్షుడిగా పనిచేసిన వ్యక్తి అనివార్య కారణాల వల్ల పదవికి రాజీనామా చేశారని, సమన్వయ లోపంతో కారణంగా ఇబ్బందులు వచ్చినట్లు చెప్పారు. మంగళ, బుధవారాల్లో పెదపాలెం సొసైటీతో పాటు చుట్టుపక్కల రైతు భరోసా కేంద్రాల్లో కూడా రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచనున్నట్లు వివరించారు. ఆమె వెంట ఏఓ శిరీష ఉన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

తాడికొండ: రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకున్న ఎంపీడీఓ బి.శివన్నారాయణను పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. అందరితో మంచిగా ఉంటూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ఆయనకు సాటి ఎవరూ లేరన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓను దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొప్పుల శేషగిరిరావు, ఆలూరి శ్రీనివాసరావు, బోరుపాలెం అధ్యక్షుడు చనుమోలు రామారావు, కొప్పుల ఆంద్రేయప్ప, ఆరేపల్లి జోజి, డీజే శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్ గద్దర్ చెన్నకేశవ, మాజీ సర్పంచి తుమ్మూరు ప్రసాద్ రెడ్డి, కొయ్యగూర వినోద్ పాల్గొన్నారు.

యువతకు క్రీడల పట్ల ఆసక్తి పెంచాలి

- నియోజకవర్గస్థాయిలో ముగిసిన ఆడుదాం ఆంధ్రా పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే శివకుమార్



క్రికెట్‌లో ప్రథమ స్థానం సాధించిన జట్టు సభ్యులకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీలు నియోజకవర్గంలో విజయవంతంగా ముగిశాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఈ క్రీడలకు మంచి స్పందన లభించిందనీ, గ్రామీణ ప్రాంతాల్లో పండుగ వాతావరణంలో క్రీడాపోటీలు జరిగాయని చెప్పారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో స్త్రీలు, పురుషులకు వేర్వేరుగా క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు ముగిశాయి. నియోజకవర్గ స్థాయి విజేతలకు సోమవారం సాయంత్రం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సభలో బహుమతులను అందజేశారు. మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ క్రీడలపై యువతకు ఆసక్తిని కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.100 కోట్ల నిధులను కేటాయించినట్లు చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో యువతీయువకులు ఎంతో ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొన్నారని చెప్పారు. విజేతలను అభినందించారు. జిల్లా స్థాయిలో కూడా విజయం సాధించి, నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. విజేతలకు షీల్డు, మెడల్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కాగా నగదు బహుమతులను క్రీడాజట్ల ఖాతాల్లో జమచేస్తారని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏదోక క్రీడలో ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు. మునిసిపల్ వైస్‌చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రతాపరెడ్డి, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, మున్సిపల్ మేనేజరు అప్పలరాజు, పెదరావూరు సర్పంచ్ కాకి రమాదేవి, ఎంపీటీసీలు కారుమంచి కిశోర్‌బాబు, నాగదేవిక, వ్యాయామ ఉపాధ్యాయులు నాగిరెడ్డి, రవీంద్ర, రమేష్, శ్రీనివాసరావు, ప్రసాదకుమారి, నాగవేణి, హరినాథ్, స్వామి, భారతి, భాస్కర్ పాల్గొన్నారు.

■ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో విజేతల వివరాలిలా..

పురుషుల విభాగంలో క్రికెట్‌లో తెనాలి రూరల్ మండలం కఠెవరం–1 సచివాలయం జట్టు విజేత కాగా, తెనాలి గంగానమ్మపేట సచివాలయం ద్వితీయ బహుమతి, కొల్లిపర మండలం మున్నంగి–1 సచివాలయం జట్టు తృతీయ బహుమతిని గెలుచుకున్నాయి. మహిళల క్రికెట్‌లో తెనాలి మండలం పెదరావూరు–2 సచివాలయం విజేత కాగా, పట్టణ గాంధీనగర్–2 సచివాలయం ద్వితీయ, కొల్లిపర మండలం వల్లభాపురం–2 సచివాలయం జట్టుకు తృతీయ బహుమతి లభించింది. బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో తెనాలి పట్టణ ఇందిరా ప్రియదర్శిని సచివాలయం విజేత కాగా, రూరల్ మండలం కొలకలూరు–2 సచివాలయం ద్వితీయ బహుమతి, కొల్లిపర మండలం వల్లభాపురం–1 సచివాలయం జట్టుకు తృతీయ బహుమతి దక్కింది. బ్యాడ్మింటన్ మహిళల పోటీల్లో తెనాలి రూరల్ కొలకలూరు–2 సచివాలయం జట్టు విజేతగా నిలిచింది. తెనాలి అయితానగర్–2 సచివాలయం, కొల్లిపర మండలం తూములూరు సచివాలయం జట్లు ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించాయి. వాలీబాల్‌లో పురుషుల విభాగంలో కఠెవరం–1 సచివాలయం జట్టు విజేత. పట్టణ ఇందిరా ప్రియదర్శిని కాలనీ సచివాలయం జట్టు, తూములూరు సచివాలయం జట్టుకు ద్వితీయ, తృతీయ బహుమతులు లభించాయి. వాలీబాల్ మహిళల విభాగంలో తెనాలి ఇందిరా ప్రియదర్శిని కాలనీ విజేతగా నిలిచింది. పెదరావూరు–1, కొల్లిపర–3 సచివాలయం జట్లు ద్వితీయ, తృతీయ బహుమతులను గెలిచాయి. కబడ్డీ పురుషుల విభాగంలో పట్టణ సీబీఎన్ కాలనీ సచివాలయం విజేతగా నిలిచింది. కొలకలూరు–2, దావులూరు సచివాలయాల జట్లు రెండు, మూడు బహుమతులను సాధించాయి. మహిళల విభాగంలో సుల్తానాబాద్ జట్టు విజేత కాగా, కొల్లిపర–2, పెదరావూరు–1 సచివాలయాల జట్లు రెండు, మూడు బహుమతులను గెలిచాయి. ఖోఖో పురుషుల విభాగంలో పట్టణ గంగానమ్మపేట–2 సచివాయలం జట్టు విజేత కాగా, పెదరావూరు–2, బొమ్మువానిపాలెం సచివాలయాల జట్లు రెండు, మూడు బహుమతులను గెలిచాయి. ఖోఖో మహిళల పోటీల్లో పెదరావూరు–1 సచివాలయం విజేతగా నిలిచింది. అత్తోట, పట్టణ సుల్తానాబాద్ సచివాలయాల జట్లు రెండు, మూడు బహుమతులను సాధించాయి.

భారతరత్న కర్పూరి ఠాకూర్ శత జయంతి ర్యాలీ



కర్పూరి ఠాకూర్ చిత్రపటంతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయీబ్రాహ్మణ సేవా సంఘ సభ్యులు

తెనాలిటౌన్: భారతరత్న పురస్కార గ్రహీత, బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ శతజయంతిని నాయీబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు సోమవారం జరిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని బోసురోడ్డులో చిట్టి ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సేవా సంఘ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పూరి ఠాకూర్‌కు భారతరత్న పురస్కారం ప్రకటించిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవా సంఘ నాయకులు చందర్లపాటి సూర్యప్రకాష్, గడ్డికోట రాజా రమేష్, కంభంపాటి శివలింగప్రసాద్, అద్దంకి శ్రీను, మాచవరం సుబ్రమణ్యం, తాడివలస దామోదరరావు, మున్నంగి సత్యం, కొడాలి మాణిక్యరావు, పిన్నెలకొండ, వల్లూరి సుబ్రమణ్యం, గోనుగుంట్ల గోపిచంద్, వెంకటేష్, రిమ్మెనపూడి నరసింహారావు, దాలిపర్తి మనోహరరావు, ఇంటూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పట్టణంలో పర్యటించిన మున్సిపల్ చైర్‌పర్సన్



మారీసుపేటలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిటౌన్: మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సోమవారం పట్టణ మారీసుపేటలో పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణ వీధులను శుభ్రంగా ఉంచాలని, రోడ్ల వెంబడి చెత్త చెదారం వేయరాదని సూచించారు. మురుగు కాల్వలో పనికిరాని వస్తువులు వేయరాదని, డంపింగ్ ఏర్పాటు చేసిన ప్రాంతంలోనే వేయాలని సూచించారు. చైర్‌పర్సన్ వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, పెదలంక వెంకటేశ్వరరావు, తోక వాసు, కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య, ఏఈ రాజు, కుర్రా శ్రీను, మేస్త్రి అప్పారావు, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సంఘకాపరులు ఆత్మలను రక్షించాలి



పాల్ ఇమ్మానియేల్‌ను సన్మానిస్తున్న బిషప్ జాన్‌పాల్, ఆనందన్న

తెనాలిరూరల్: సంఘకాపరులు అనేక ఆత్మలను రక్షించాలని, అందుకు ప్రతి ఒక్కరు ప్రార్థనలో బలపడాలని అంతర్జాతీయ వర్తమానికులు పాల్ ఇమ్మానియేల్ సూచించారు. ది తెనాలి యునైటెడ్ పాస్టర్స్ అండ్ గాస్పెల్ వర్కర్స్ అసోసియేషన్ జనవరి నెల సమావేశాన్ని తెనాలి ఇస్లాంపేటలోని కృష్ణ బలిజ కళ్యాణ మండపంలో బ్రదర్ ఆనందన్న ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ పినపాటి జాన్‌పాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్ ఇమ్మానియేల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాస్టర్లు మండుచున్న అగ్ని వలె ఉండాలని, బైబిల్‌లోని లోతైన మర్మాలను తెలుసుకుంటుండాలన్నారు. బిషప్ జాన్‌పాల్ మాట్లాడుతూ సంఘకాపరులు ఐక్యంగా ఉంటూ తమ సంఘాలను బలోపేతం చేసుకోవాలన్నారు. రెవ ఇమ్మానియేల్ దాస్, రెవ భానుప్రసాద్, పాస్టర్లు మార్టిన్ లూథర్‌బాబు, విక్టర్‌పాల్, బిషప్ జె.ప్రభుదాస్ ప్రసంగించారు. కోఆర్డినేటర్లు స్టీఫెన్, షాలేమురాజు, రత్నరాజు, ఐజక్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పాల్‌ఇమ్మానియేల్‌ను సంఘ బాధ్యులు సత్కరించారు.

రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీ ఆర్‌వీఎస్ ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య



మాట్లాడుతున్న భాస్కరయ్య

తాడేపల్లిరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడిన రజక వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య కోరారు. ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి అమరారెడ్డి భవన్‌లో రాష్ట్ర స్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 72 సంవత్సరాలు గడిచినా భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన రిజర్వేషన్లు అమలు జరగడం లేదని చెప్పారు. రజక వృత్తిదారులు దుర్భర జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. రజక వృత్తిని సేవా వృత్తిగా భావించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. రజక వృత్తిదారులకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్ట పరిధిలో రక్షణ కల్పించాలని కోరారు. 50 ఏళ్ల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరికి వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలన్నారు. రజక వృత్తిదారుల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.1000 కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రజక వృత్తిదారులకు సంవత్సరానికి రూ.10 వేల ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించాలని, ఆదరణ పథకం–2 ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఆదరణ పనిముట్లు అందజేయాలని, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, టీపీ రాష్ట్ర గృహ నిర్మాణ పథకం ద్వారా అర్హులైన ప్రతి రజక కుటుంబానికి శాశ్వత గృహ నిర్మాణ పథకం ద్వారా గృహాలు మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెదపాలెంలో మేరీమాత మహోత్సవం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెంలో ఏసు తిరు హృదయ దేవాలయం ఆర్‌సీఎం చర్చిలో సోమవారం మేరీమాత మహోత్సవం సందర్భంగా తేరు ప్రదక్షిణ కార్యక్రమం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. రెవ.ఫాదర్ అంథోని రాజు, ప్రభుకుమార్, కిరణ్ పాల్గొని దివ్య బలిపూజ నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామస్తులు భారీగా విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఆర్‌సీఎం చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై మేరీమాత ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

ఆరోగ్య పరీక్షలు చేయించుకునేలా చూడాలి



ఫిరంగిపురం: ఇటీవల మండలంలోని పలుగ్రామాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలలో పరీక్షలు చేయించుకుని పెద్ద వైద్యశాలలకు రిఫర్ చేసిన వారిని తప్పని సరిగా పరీక్షలు చేయించుకునేలా చూడాల్సిన బాధ్యత ఆరోగ్యసిబ్బందిపై ఉందని జిల్లా ప్రోగ్రాం అధికారి రత్నమన్‌మోహన్ కోరారు. మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఇప్పటి వరకు జగనన్న ఆరోగ్య సురక్షలో ఎందరు పరీక్షలు చేయించుకున్నారో వారి వివరాలు వైద్యాధికారి యానిగ్రేస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యసిబ్బంది ఇప్పటి వరకు పరీక్షలు చేయించుకునేందుకు వెళ్లని రోగుల వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకునేలా చూడాలని చెప్పారు. పేదవారి ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం ఫిరంగిపురంలో పరీక్షలు కోసం రిఫర్ చేసిన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు.

అప్రమత్తతతో రహదారి ప్రమాదాలు దూరం



ప్రతిజ్ఞ చేస్తున్న రవాణాశాఖ అధికారి రాఘవరావు, తదితరులు

పెదకాకాని: వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి రాఘవరావు అన్నారు. పెదకాకాని మండలం నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల నందు సోమవారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా కళాశాల బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ అధికారి రాఘవరావు మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్లపై వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రోడ్డుకు ఎడమ వైపు మాత్రమే వాహనాలు నిలపాలని సూచించారు. యాజమాన్యాలు డ్రైవర్లకు ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. రోడ్ల పైకి వచ్చే వాహనాలకు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రత మనందరి బాధ్యత అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలు మనందరి మంచి కోరి రవాణా శాఖ నిర్వహిస్తుందన్నారు. రవాణా శాఖ అధికారులు అందించే సూచనలు డ్రైవర్లు తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం డ్రైవర్లచే రోడ్డు నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు కె మల్లీశ్వరి, జి సౌజన్య, కళాశాల ట్రాన్స్‌పోర్ట్ కన్వీనర్ పీవీ సురేంద్రమోహన్ కుమార్, ఎం లక్ష్మీ వినీత, విద్యార్థులు, రవాణా సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



తాడికొండ: తాడికొండ బస్టాండ్ కూడలిలో బీఎస్‌ఎస్‌బీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తులసీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులతో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని సచివాలయం–4 కార్యదర్శి సుమియా ప్రారంభించారు. 153 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిగ్రీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సునీతా లక్ష్మి, డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ ఏవీ రాఘవయ్య పాల్గొన్నారు.